క్లుప్తంగా

ముగిసిన నాటక ప్రదర్శన



మరికల్: పెద్దచింతకుంటలో మూడు రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మంగారి నాటక ప్రదర్శన శనివారం అర్ధరాత్రి ముగిసింది. చివరి రోజు బ్రహ్మంగారి సమాధి సన్నివేశాలను కళాకారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు గ్రామ పెద్దలు అభినందించారు.

28వ రోజుకు చేరిన వీఓఏల దీక్షలు



మక్తల్: పట్టణంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద చేపట్టిన వీఓఏల నిరసన ఆదివారం 28వ రోజుకు చేరాయి. వారు మాట్లాడుతూ నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలయ్య, రాంరెడ్డి, జ్యోతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేద్దాం

ఊట్కూర్: మండలంలోని క్రీడామైదానంలో మంగళవారం నిర్వహించే సీఎం కప్ క్రీడాపోటీలను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 36ఏళ్ల లోపు వారు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొనవచ్చని, సోమవారం సాయంత్రం పేర్లను ఎంపీడీఓ కార్యాలయంలో నమోదు చేయించాలని కోరారు.

సీఎం కప్ పోటీల్లో పాల్గొనాలి

మద్దూరు: మండల కేంద్రంలో ఈ నెల 16 నుంచి నిర్వహించే సీఎం కప్ పోటీల్లో ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొనాలని ఎంపీడీఓ విజయలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో నిర్వహించే పోటీలకు 15 నుంచి 36 ఏళ్లలోపు వారు అర్హులని, క్రీడాకారులు పాల్గొనే విధంగా చూడాలని సర్పంచ్‌లకు, ప్రజాపతినిధులకు సూచించారు.

ఎలక్ట్రీషియన్లకు అవగాహన



మక్తల్: ఎలక్ట్రీషియన్లకు ఆదివారం పట్టణంలో ఫంక్షన్‌హాల్‌లో ఇంటి వైరింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు మక్తల్, మాగనూర్ ,కృష్ణ, ఊట్కూర్ మండలాలకు చెందిన ఎలక్ట్రీషియన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కే.కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఇంటి వైరింగ్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు వివేకానంద, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ పునఃప్రతిష్ఠాపన

మద్దూరు: జాథరామ్‌పల్లిలో ఉరడమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠాపన పండితులు రాఘవేంద్రచారీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ రాజ్యలక్ష్మి, రాజశేఖర్ దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం ఉరడమ్మకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు.

మత్స్య సహకార సంఘం ఎన్నిక



మక్తల్: మత్స్యసహకార సంఘం అధ్యక్షుడిగా కోళ్ల వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ముదిరాజ్ భవనంలో మత్స్య సహకార సంఘం ఎన్నికల్లో మొదటగా 9 మంది డైరెక్టర్లు ఎంపిక చేసి, అనంతరం అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి లావణ్య తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా శేఖర్, ఉపాధ్యక్షుడిగా శ్యామ్, కోశాధికారిగా లక్ష్మణ్ ఎంపికయ్యారు. వారికి నియామక పత్రాలను అందించారు. అనంతరం పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పనులు పూర్తి చేయాలి

కోస్గి: నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చేపట్టిన సీసీ నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులు సమస్య పరిష్కారానికి కృషిచేయాలని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి డీకే రాములు డిమాండ్ చేశారు. గత 15 రోజులుగా బస్సులను బస్టాండ్ బయట ప్రధాన రోడ్డుపై నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. రూ. 50 లక్షలతో చేపట్టిన సీసీ నిర్మాణ పనులను కేవలం కంకర వేసి వదిలేయడం సరి కాదని వెంటనే పూర్తిచేయాలని కోరారు.

నిర్వహణ గాలికి..

- పల్లె ప్రకృతి వనాలపై నిర్లక్ష్యం
- ఎండుతున్న మొక్కలు

మాగనూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో పల్లె ప్రకృతి, పట్టణాల్లో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. మండలంలోని పలు గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ సరిగ్గా లేక మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు వెచ్చించి వనాలు ఏర్పాటు చేస్తే నిర్వహణ లేక అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీనికి తోడు కనీస సౌకర్యాలు లేకపోవడంతో గేట్‌కు తాళం వేయాల్సిన దుస్థితి నెలకొంది. మరి కొన్ని చోట్ల ఆకతాయిలకు, పల్లె ప్రకృతి వనాలు అడ్డాగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

వనాలకు తాళాలు..

ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ.. జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో ప్రజల నుంచి ఆదరణ కరువైంది. దీంతో చేసేదేమీ లేక వనాలకు తాళం వేసి ఉంచుతున్నారు. మండలంలోని మాగనూర్, వడ్వాట్, తళంకేరి, నేరడగండొడ్డి, ఉజ్జెల్లి, బైరంపల్లి, నేరడగం తదితర గ్రామాలలో గ్రామాలకు దూరంగా వనాలను ఏర్పాటు చేయడంతో ఉపయోగం లేకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు.



తాళం వేసి ఉన్న కొల్పూర్ పల్లెప్రకృతి వనం



మాగనూర్‌లో నిర్వహణ లేక మంటలకు కాలిపోయిన పల్లెప్రకృతి వనంలోని మొక్కలు

నెరవేరని ప్రభుత్వ లక్ష్యం..

గ్రామ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. వాకింగ్ ట్రాక్‌లను నిర్మించారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా పలు ఆటవస్తువులను ఏర్పాటు చేశారు. కాని జనావాసాలకు దూరంగా ఉండటంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామస్తుల నుంచి స్పందన లేకపోవడంతో వనాలకు తాళాలు వేయక తప్పడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

గ్రామాలకు దూరంగా..



పల్లెప్రకృతినం గ్రామానికి చాలా దూరంలో ఉంది. దీంతో గ్రామస్తులు ఒక్కరూ కూడా వెళ్లడం లేదు. మొక్కలు ఎండినా అధికారులు పట్టించుకోవడం లేదు. చెత్తాచెదారం దర్శనమిస్తోంది. నిర్వహణ సరిగ్గా లేక పల్లెప్రకృతి వనం అస్తవ్యస్తంగా ఉంది.

– వెంకటేష్, వడ్వాట్

కనీస సౌకర్యాలు లేవు..



ప్రభుత్వం ఎంతో ఖర్చుచేసి ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. చిన్నారుల కోసం ఆట వస్తువులు ఏర్పాటు చేయలేదు. కనీస సౌకర్యాలు లేవు. దీంతో గ్రామస్తులు వనానికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు.

– రమేష్, మాగనూర్ గ్రామస్తుడు

వినియోగంలోకి తీసుకొస్తాం..



రెండు సంవత్సరాలు ఈజీఎస్ ద్వారం పల్లెప్రకృతి వనాలు మొక్కలకు నీరు పోశాం. తర్వాత గ్రామ పంచాయతీలకు అప్పగించాం. ఎక్కడైనా మొక్కలు ఎండిపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకుంటాం.

– జైపాల్‌రెడ్డి, ఎంపీఓ మాగనూర్.

విద్యార్థుల్లో ప్రజ్ఞ వికసించాలి

వనపర్తిటౌన్: విద్యార్థుల్లో ప్రజ్ఞ వికసించాలని వికాస తరంగిణి వీటీ కార్యకర్త శ్రీనివాస రామానుజదాస అన్నారు. ఆదివారం వికాస తరంగిణి ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర ఆలయంలో ఐదేళ్ల నుంచి 15ఏళ్ల లోపు పిల్లలకు ప్రజ్ఞ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో వ్యక్తిత్వం, నైతిక విలువలను పెంపొందించడం ద్వారా మానవీయమైన సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. విద్యార్థుల్లో ఆలోచన శక్తిని, సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రజ్ఞ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచి ఆధ్యాత్మిక భావన ప్రేరేపిస్తే సత్ప్రవర్తన పౌరులుగా రాణిస్తారని చెప్పారు. కార్యక్రమంలో శ్రీవాణి, శ్రీలక్ష్మీ, రాజేశ్వరి, పద్మావతి, సుమిత్రమ్మ, మంగమ్మ, పద్మమ్మ, విమల, రాధిక, వీరమణి తదితరులు పాల్గొన్నారు.



ధ్యానం చేస్తున్న చిన్నారులు



జడ్చర్ల టౌన్: శంకరాయపల్లితండా బొంగరాల గుట్ట వద్ద నిర్మించిన ఆలయంలో తుల్జాభవాని విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. మూడురోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో

వెభవంగా చండీహోమం

చివరి రోజు చండీహోమం పూర్ణాహుతి సమర్పించారు. ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

మిడ్జిల్: దోనూర్‌లో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. జలాభిషేకం చేపట్టారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ సుదర్శన్, సర్పంచ్‌లు సరిత, జంగారెడ్డి, మధుసుధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

దామరగిద్ద: మండలకేంద్రంలో ఆదివారం నాభిశిలా(బోడ్రాయి) ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. జాలాభిషేకం చేపట్టారు. సర్పంచ్ ఆశమ్మ సమక్షంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శివకుమార్‌రెడ్డి, బీజేపీ నాయకుడు సత్యయాదవ్ హాజరయ్యారు. ఈ మేరకు వారిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఎంపీపీ నర్సప్ప, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, వన్నాడ వెంకటప్ప, విండో అధ్యక్షుడు ఈదప్ప తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు ప్రారంభం

చిన్నచింతకుంట : గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నాడని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. దమగ్నాపురం గ్రామానికి రూ. 90 లక్షల నిధులతో బీటీ రోడ్డును ఆదివారం ప్రారంభించారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, రైతు సమన్వయ కమిటీ మెంబర్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆదర్శ బీఈడీ కళాశాలలో విద్యార్థులకు విద్య వైజ్ఞానిక శిక్షణ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల్లో జాప్యం

నర్వ: మక్తల్–గద్వాల రహదారి పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని రోజులుగా సత్యావార్ నుంచి ఎల్లంపల్లి వరకు రహదారిని తవ్వడంతో రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. నిత్యం ఈ రహదారి గుండా గద్వాల్‌కు వందలాది వాహనాలు వెళ్తున్న క్రమంలో ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉందని ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి పనులతో పాటు కొండదొడ్డి, పెద్దకడ్మూర్‌ల వద్ద ఉన్న బ్రిడ్జిలను మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు. పనులను స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి పూర్తి చేయాలని తెలుపుతున్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

- ఐదు పర్యాయాలు టెండర్లకు ఆహ్వానం
- పనుల కోసం ముందుకు రాని కాంట్రాక్టర్లు

అమరచింత: మన ఊరు –మన బడి కార్యక్రమం ద్వారా పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడు తరగతి గదులను తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాలకు అధికారులు రూ.4.65కోట్లతో మొదట ప్రతిపాదించారు. వీటిని కేటాయించాలని నివేదికను జిల్లా విద్యాధికారితో పాటు పాటు ప్రభుత్వానికి నివేదించారు. రెండో విడతలో పాఠశాలకు మన ఊరు–మనబడి ద్వారా రూ.82 లక్షలు మంజూరు చేశారు. పాఠశాల పునః ప్రారంభ సమయంలో వీటికోసం ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు పాఠశాల మూత పడే సమయానికి సైతం పనులను మొదలు పెట్టలేక పోయారు. మంజూరైన పనుల కోసం అధికారులు ఇప్పటికి ఐదు సార్లు టెండర్లు పిలిపించిన ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. ఇప్పటి వరకు టెండర్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పీఆర్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. చివరకు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌తో పనులు చేయించవచ్చని అధికారులు ముందుకు వచ్చిన, వారు కూడా ముందుకు రాలేకపోతున్నారు. ప్రస్తుతం మన ఊరు –మన బడి ద్వారా మొదటి విడతలో కేవలం రూ.30 నుంచి రూ.60 లక్షల మధ్య ఖర్చుతో ఉన్న పాఠశాలల నిర్మాణాలను గుర్తించిన అధికారులు వీటిని మరుగున పడేశారు. దీంతో ఎప్పుడు పాఠశాల గదులు కూలుతాయో అన్న సందేహాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ కాలం కాలన్ని గడిపే పరిస్థితులు దాపురించాయి. ఈ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియంలు కొనసాగుతున్నాయి. మొత్తంగా 524 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.



శిథిలావస్థలో ఉన్న కార్యాలయ గది



పెచ్చులూడుతున్న తరగతి గదులు

పెచ్చులూడుతున్న పైకప్పు

పాఠశాలలో మొత్తంలో ఏడు తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయి. ఏళ్లుగా గదులలో పెచ్చులూడుతున్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులకు పాఠశాల ఉపాధ్యాయులు విన్నవించారు. మన ఊరు –మన బడిలో వీటిని గుర్తించారు. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన కనిపించడం లేదు. భారీ మొత్తంలో నిధులు అవసరం కావడంతో రెండవ విడతలో వీటిని నిర్మించాలని భావించిన అధికారులు అంచనా విలువను నివేదించడంతోనే సరిపెట్టారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలకు 12 గదులు, ఆఫీస్ రూంతో పాటు 13 గదులు ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం 10 గదులు మాత్రమే ఉండడంతో వాటిలోనే విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు.

ఐదు సార్లు టెండర్లు ఆహ్వానించాం..

పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మనబడి ద్వార రూ.82 లక్షలు మంజూరయ్యాయి. వీటితో తరగతి గదితో పాటు కిచెన్, డైనింగ్ హాల్, బాత్‌రూంలు, అదనపు గది, ఎలక్ట్రిక్ పనులు, నీటి సరఫరాతో పాటు చిన్నచిన్న మరమ్మతుల కోసం టెండర్లు ఆహ్వానించాం. ఐదు సార్లు టెండర్లు వేస్తూనే ఉన్నా ఒక్కరు సైతం ముందుకు రావడం లేదు. పనుల కోసం నిధుల కొరత లేదని ఎవరైనా పనులు చేస్తే వెంటనే బిల్లులు అందించేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రావు, ఈ పంచాయతీరాజ్

ఘనంగా హనుమాన్ జయంతి

మరికల్: తీలేర్‌లో ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి ధార్మిక కార్యక్రమాలను విస్తరించి ప్రజల్లో భక్తి భావలను పెంపొందించాలని సూచించారు. అనంతరం ఆంజనేయస్వామికి తమలపాకుల పూజ, గ్రామస్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ రేవతమ్మ, ప్రశాంత్‌రెడ్డి, రామాచారి, కృష్ణయ్య, శ్రీరాములు, నరేష్ పాల్గొన్నారు.



భక్తులతో టీటీడీ ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్

మాగనూర్: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ నరేందర్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వాబయ్య పెద్దవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా, రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది పట్టుకున్నట్లు చెప్పారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యాజమాని, డ్రైవర్ వాబయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్ అధికారి అండతో..

మండలంలో ఇసుక తరలింపు పోలీస్ అధికారి సహకారం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై సీఐ సీతయ్యను వివరణ కోరగా.. ఈ విషయం నిజమేనని, పోలీస్‌స్టేషన్‌లోని ఓ అధికారే ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా నడిపేందుకు సహకరిస్తున్నారని తెలిసిందని చెప్పారు. ఇందులో భాగంగానే ఆదివారం తెల్లవారుజామున నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీ చేశామన్నారు. దాదాపుగా మండల కేంద్రంలో పది ట్రాక్టర్లకు పైగా ఇసుక నడిపిస్తున్నట్లు తెలిసిందని, అన్ని తప్పించుకుని వెళ్లగా, ఒక్క ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతులకు జీలుగు విత్తనాల పంపిణీ



జీలుగు విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్: మండల కేంద్రంలోని రైతు ఆగ్రోస్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి జీలుగు విత్తనాల పంపిణీ ప్రక్రియను ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు పంటలకు ముందు జీలుగు విత్తనాలు పొలాల్లో వేస్తే భూమిలో సారం అధికంగా లభిస్తుందని, దీంతో అధిక దిగుబడి వస్తుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాగనూర్ సర్పంచ్ రాజు, తిప్పయ్య, నారాయణ, మధుసూదన్‌రెడ్డి, మల్‌రెడ్డి, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ఐజీ రమేష్‌రెడ్డిని సన్మానించిన నాయకులు

ఆత్మకూర్: ఐజీగా నియమితులైన రమేష్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఆదివారం పదోన్నతిపొందిన తర్వాత మండలంలోని మస్తిపురంకు వచ్చిన ఆయనను రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటిశ్రీహరి, చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అయ్యూబ్‌ఖాన్, తులసీరాజ్, రహెమతుల్లా, పరమేష్, నల్లగొండ శ్రీను, మహేందర్‌రెడ్డి, రవీందర్, శరణప్ప, అరుణ్, శ్యాం, విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.



ఐజీ రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాఠశాల ఆవరణ మురుగుమయం



పాఠశాల రోడ్డు పక్కన చేరిన మురుగు

దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో మురుగుమయం కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాకాల కారణంగా చేరిన నీటితో పాటు, మురుగు నిల్వ ఉండడంతో దోమల అధికసంఖ్యలో వస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. పాఠశాల ప్రారంభం అయ్యేలోపు డ్రెయినేజీలు నిర్మించి, ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ విషయమై పాలకమండలి దృష్టికి తీసుకెళ్లామని వార్డు కౌన్సిలర్ నాగలక్ష్మి తెలిపారు.

విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

మహబూబ్‌నగర్ క్రీడలు: అప్పన్నపల్లి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఆదివారం జీకే షోటోకాన్ కరాటే డూ ఇండియా మాస్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బ్లాక్ బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. జీకే మాస్టర్ షోటోకాన్ ఫౌండర్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి.కృష్ణయ్య, చైర్మన్ రవికుమార్ ఎగ్జామినర్లుగా వ్యవహరించారు. పరీక్షలో ఐశ్వర, ఎస్. హరిణి, అభినవ్, జయవంత్, నవతేజ, నిశాంత్, వినయ్‌కుమార్, రామ్‌చరణ్, సాయినందు, భూపేష్, తిమ్మప్ప, ఎల్.శ్రవణ్, గౌతమ్ బ్లాక్‌బెల్టులు సాధించారు. ఉపాధ్యాయుడు రాజేందర్, కౌన్సిలర్ రామాంజనేయులు, జీకే షోటోకాన్ కరాటే జిల్లా అధ్యక్షుడు శివకుమార్, పట్టణ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.



బ్లాక్‌బెల్టు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

కరాటేతో స్వీయరక్షణ

మహబూబ్‌నగర్ క్రీడలు: స్వీయ రక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని ఆల్ పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ కన్వీనర్ మోసీన్‌ఖాన్, కాంగ్రెస్ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జహీర్ అక్తర్ అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో వేసవి 25వ ఉచిత కరాటే శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు యోగా శిక్షణ అందజేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మోసీన్‌ఖాన్, జహీర్ అక్తర్ మాట్లాడారు. జహంగీర్‌పాష ఖాద్రీని అభినందించారు. వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కోయిల్‌కొండ: మండలంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు పేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సోమవారం రానున్నట్లు ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. దమాయపల్లి–గార్లపహాడ్, తిర్మలంపల్లి–గార్లపహాడ్ బీటీ రోడ్ల రెన్యూవల్ పనులు, కేశ్వాపూర్ హెల్త్‌సెంటర్, పారుపల్లి పంచాయితీ భవనం, శేరివెంకటాపూర్ ఆరోగ్యకేంద్రం, అంకిళ్ల హెల్త్‌సబ్ సెంటర్ భవనాల శంకుస్థాపన తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. అనంతరం కోయిల్‌కొండలో మండలస్థాయి సీఎంకప్ పోటీలు ప్రారంభిస్తారని వివరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మక్తల్: పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాలలో 2002–03 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళన ఆదివారం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు నర్సప్ప, చందులాల్, భాస్కర్, రాంలింగప్ప, బుచ్చప్ప, రామ్మోహన్, శివలింగప్ప, చంద్రశేఖర్‌లను సన్మానం చేశారు.